క్లుప్తంగా

అందుబాటులో లేనంటూ వాట్సాప్ స్టేటస్

తిమ్మాపూర్: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఎల్ఎండీలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం అందుబాటులో లేరు. వ్యక్తిగత కారణాలతో తాను అందుబాటులో ఉండడం లేదని ఎమ్మెల్యే వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన సమయంలో అసెంబ్లీ సమావేశాలు ఉన్నప్పుడు మినహా మిగతా రోజులు క్యాంపు కార్యాలయంలోనే ఉంటానని కవ్వంపల్లి తెలిపారు. ప్రజలు తెలియకుండా కార్యాలయానికి వస్తారని, సోమవారం వ్యక్తిగత, ఇతర పనులు ఉన్న కారణంగా నియోజకవర్గ ప్రజలకు తెలిసేలా వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్నారని నాయకులు చెప్పారు.

అండర్ బ్రిడ్జి నిర్మించాలి

శంకరపట్నం: మండలంలోని తాడికల్–చింతగట్టు మార్గంలో అండర్ బ్రిడ్జి నిర్మించాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ హైవే అథారిటీ అధికారులకు లేఖ రాసినట్లు చింతగట్టు గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు తెలిపారు. తాడికల్ నుండి –చింతగుట్టకు వెళ్లే దారి మూసివేశారని ఎంపీని కలిసి తమగోడు వెళ్లబోసుకోవడంతో అధికారులకు లేఖను రాశారని తెలిపారు.

పూడిక తీత చేపట్టాలి

సైదాపూర్: మిడ్‌మానేర్ కుడి కాలువలో పూడిక పేరుకుపోయి యాసంగికి సాగునీరు రావడం లేదని పూడిక తీత పనులు చేపట్టాలని మండలంలోని జాగీర్‌పల్లి, గుజ్జులపల్లి రైతులు కోరుతున్నారు. సాగునీటి కాలువల ఆధారంగా పండిస్తున్న వరి, మొక్కజొన్న పంటలకు నీరు సరిగా అందడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం రైతులం పూడిక తొలగించుకున్నామని, గతేడాది సాగునీరు రాలేదని ఈ ఏడాది కూడా కాలువల్లో పూడికతో సాగునీరు వస్తలేదని రైతులు పేరం తిరుపతి, దుమ్మాల ఈరయ్య, మంతుర్తి అనిల్, గుంపుల మధుకర్, పేరం రవి, మెడవేన మధూకర్, రాజులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇరువర్గాలపై కేసు

జమ్మికుంట: భూ వివాదంలో జరిగిన దాడిలో ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. మండలంలోని మాచనపల్లి గ్రామంలో బండి మహేశ్వరి, నరేశ్, సమ్మయ్య, అదే గ్రామానికి చెందిన బండి రాజు, కొంరయ్య, స్వరూప భూ వివాదంలో దాడులకు చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.


విద్యుత్ మోటార్ చోరీ

శంకరపట్నం: మండలంలోని ఇప్పల్లపల్లి గ్రామంలో ఎస్సారెస్పీ కాలువలో బిగించిన వ్యవసాయ మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. గ్రామానికి చెందిన ఇప్పల దేవరాజు పొలంవద్ద వరిసాగుతో పాటు కూరగాయలు సాగుచేస్తున్నాడు. వ్యవసాయబావికి మోటార్ ఉన్నా నీరు సరిపోవడంలేదని కాలువలో మోటార్ బిగించాడు. సోమవారం తెల్లవారు జామున పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా మోటార్ కనిపించలేదు. వెంటనే పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

ప్రణాళికతో చదవాలి

చొప్పదండి: విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికతో చదవాలని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ పృథ్వీరెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సోమవారం ప్రేరణ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఉండాలని, పరీక్షా సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వైద్యుల రాజిరెడ్డి, ఏ. శ్రీనివాస్, బి. రాహుల్, విజయలక్ష్మి, సునీత, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం అందజేత



అల్పాహారం అందిస్తున్న ఎంపీడీవో రాజేశ్వరి, దాతలు నర్సయ్య, శంకర్ ప్రభాకర్

రామడుగు: మండలంలోని వెలిచాల జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గ్రామానికి చెందిన దాతలు గాదె నర్సయ్య, దొమ్మాటి శంకర్, వంగ ప్రభాకర్ అల్పాహారం కోసం విరాళం అందజేశారు. సోమవారం ఎంపీడీవో రాజేశ్వరి విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన యువకులు మార్క వెంకటేశ్, చిమ్మల్ల అశోక్, రమేశ్, అజయ్, ఎండీ అజీజ్ పోలీస్‌కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించగా ఎంపీడీవో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దాతలతో పాటు ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యువకులను సన్మానిస్తున్న ఎంపీడీవో రాజేశ్వరి

పాలకులకు పట్టింపేది..?

- కలగానే చిలుకలవాగుపై వంతెన
- 20 ఏళ్లుగా నిర్మించకపోవడంతో ఇబ్బందులుపడుతున్న ప్రజలు
- వాగు ప్రవహిస్తే.. రాకపోకలు బంద్
- వానాకాలంలోపు నిర్మించాలని మంత్రి పొన్నంకు విన్నపం



ధ్వంసమైన చిలుకలవాగుపై గతంలో నిర్మించిన వంతెన

సైదాపూర్: మండలంలో గత పదేళ్లలో అధికారంలో ఉన్న పాలకులు మట్టిరోడ్లకు మరమ్మతులు చేపట్టలేదు. భారీ వర్షాలకు రోడ్లు ధ్వంసం కావడంతో ఆయా గ్రామాలకు సంబంధాలు తెగిపోతున్నాయి. మండలంలోని పెరుకపల్లి పంచాయతీ పరిసర గ్రామాలకు ఇరవై ఏళ్లుగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. పెరుకపల్లి నుంచి బొమ్మనపల్లి, దుద్దెనపల్లి గ్రామాలకు మట్టిరోడ్డు ఉంది. పెరుకపల్లి శివారులోని చిలుకలవాగుపై వంతెన నిర్మాణానికి 2004లో నిధులు మంజూరయ్యాయి. గుత్తేదారు నాసిరకంగా పనులు చేయడంతో తర్వాత ఏడాది కురిసిన భారీ వర్షాలకు వాగు ప్రవాహం ఎక్కువై వంతెన తెగిపోయింది. అప్పటి నుంచి వంతెన పునఃనిర్మాణానికి పాలకులు, అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రభుత్వాలు, పాలకులు మారినా ఎన్నికలప్పుడు హామీలు ఇచ్చి గెలిచాక వంతెన నిర్మాణం ఊసెత్తకపోవడంతో పరిపాటిగా మారింది. ఇరవై ఏళ్లుగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగులోంచి ప్రయాణం సాగిస్తున్నారు. వర్షం పడితే చాలు గంటలో వాగు పొంగిపొర్లుతుంది. సర్వాయిపాపన్న గొలుసుకట్టు గుట్టల నుంచి వరద చిలుకలవాగు ద్వారా దుద్దెనపల్లి చెరువుల్లో కలుస్తోంది.పెరుకపల్లి–బొమ్మనపల్లి మధ్యలోని వాగుపై నిర్మించిన వంతెన తెగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రం కరీంనగర్‌కు వెళ్లడానికి దగ్గరి మార్గం కావడంతో ఘనపూర్, ఆకునూర్, గొల్లగూడెం, పెరుకపల్లి, శివరాంపల్లి, సర్వాయిపేట ప్రజలకు ఈ దారి గతంలో ఉపయోగంలో ఉండేది. ఇదిలా ఉంటే ఉమ్మడి పెరుకపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం, పెరుకపల్లి శివరాంపల్లి, సర్వాయిపేట గ్రామస్తులకు పెరుకపల్లి ఊరుపక్కనే ఉన్న చిలుకలవాగు దాటితేనే వ్యవసాయ భూములు ఉన్నాయి. వర్షాకాలంలో వాగు దాటందే ఎవుసం సాగదు. వాగు ప్రవహిస్తున్న నీటిల్లో నుంచి పొలాల వద్దకు వెళ్తుంటారు. ఇరవై ఏళ్లుగా గోస పడుతున్నామని పెరుకపల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. వంతెన, రోడ్డునిర్మాణం కోసం నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు గ్రామ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. వర్షాకాలం నాటికే వంతెన నిర్మించాలని ఉమ్మడి పెరుకపల్లి ప్రజలు కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి



చిలుకలవాగుపై వంతెన నిర్మించాలి. వాగు దాటి పొలాల వద్దకు పోయి వ్యవసాయం పనులు చేసుకొని ఇంటికి రావడం ఇబ్బందిగా ఉంది. వర్షాకాలంలో పొలాల వద్దకు పోయి ఇంటికి వద్దామంటే వర్షాలకు గంటలోనే వాగు పొంగి ప్రవహిస్తోంది. వర్షాకాలంలో వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నాం. వాగు పొంగి ప్రవహిస్తున్నప్పుడు కరీంనగర్, చిగురుమామిడికి వివిధ పనుల నిమిత్తం వెళ్లడానికి సైదాపూర్ నుంచి అదనంగా పది కిలోమీటర్లు తిరిగి వెళ్తున్నాం. ప్రధానంగా వ్యవసాయ పనులకు ఇబ్బందిగా ఉంది వానాకాలంలోపు వాగుపై వంతెన నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేయాలి.

– ముత్యాల మల్లేశ్, పెరుకపల్లి

హామీలు అమలు చేసేదాక వదలం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

గంగాధర: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయడంతో పాటు యాసంగి వరికి రూ. ఐదువందల బోనస్ ఇవ్వాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలో సోమవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నామని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు వదలమన్నారు. ఎంపీగా ఉన్నపుడే కరీంనగర్‌కు రైల్వే ప్రాజెక్టు, కరీంనగర్ స్మార్ట్ సిటీ కోసం రూ. వెయ్యి కోట్లు తెచ్చానన్నారు. బీఆర్ఎస్ పాలనలోనే నిరంతర విద్యుత్, లక్షకుపై ఉద్యోగాలు ఇచ్చామని, రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపామన్నారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ చేసిందేమి లేదని, రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదనే బీఆర్ఎస్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నాడని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ కృష్ణారావు, నాయకులు విజయేందర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మధుసూదన్, నవీన్‌రావు, శేఖర్, దామోదర్ పాల్గొన్నారు.

పన్నులను సకాలంలో వసూలు చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ అయాజ్

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పన్నుల వసూలుపై అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మార్చి 31వ తేదీ నాటికి వంద శాతం పన్నుల వసూలు చేయాలని, లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేనేజర్ భూపాల్‌రెడ్డి, టౌన్ ప్లాన్ ఆఫీసర్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ వాణి, భాస్కర్, జూనియర్ అసిస్టెంట్, వార్డు ఆఫీసర్స్, బిల్ కలెక్టర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్నశాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు

జమ్మికుంట: పంట చేలో పురుగుమందు పిచికారీ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని కేవీకేలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్‌ఎం) హైదరాబాద్‌శాస్త్రవేత్త డాక్టర్ ఉదయభాను ఆధ్వర్యంలో 50 మంది రైతులు, డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్లైఫోసెట్ మందు పిచికారీ చేస్తున్నప్పుడు జాగ్రత్తలు పాటించాలని, వివిధ స్ప్రేయర్లు వాడే విధానం, అజాగ్రత్త వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌రెడ్డి, దేశి కోఆర్డినేటర్ రాంచంద్రారావు, రైతులు, డీలర్ల తదితరులు పాల్గొన్నారు.

దళిత సంఘాల నాయకుల ర్యాలీ



తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో సాదుశెట్టి కులానికి చెందినవారు (బేడ బుడిగజంగాలు) తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని గ్రామానికి చెందిన దళిత సంఘాల నాయకులు, కులస్తులు సోమవారం తెలంగాణ తల్లి విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. 2014లో తహసీల్దార్ ధ్రువీకరణ పత్రాలను ఇచ్చి రద్దు చేశారని, మళ్లీ ఎస్సీ సర్టిఫికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారని, వీరిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం జీపీవీ రంగనాథశర్మ, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయికి విద్యార్థుల ఎంపిక

రామడుగు: మండలంలోని రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి జెండర్ డిస్క్రిమినేషన్ (డ్రామా) అంశంలో జిల్లాస్థాయిలో మొదటి స్థానం పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం జీపీవీ రంగనాథశర్మ తెలిపారు. విద్యార్థులు వైష్ణవి, పల్లి ప్రణయ, పింగిలి అనన్య, సహస్ర, శివమణి గైడ్ టీచర్ శ్రావణ్‌కుమార్‌ను సోమవారం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి ధర రూ.7,150

జమ్మికుంట: స్థానిక వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర సోమవారం గరిష్టంగా రూ.7,150 పలికింది. మోడల్ ధర రూ.7,000, కనిష్ట ధర రూ.6,100కు వ్యాపారులు కొనుగోలు చేశారు.

నియామకం

చొప్పదండి: కాంగ్రెస్ పార్టీ చొప్పదండి సోషల్ మీడియా కార్యదర్శిగా పట్టణానికి చెందిన కళ్యాణపు శ్రీనివాస్‌ను నియమించినట్లు కోఆర్డినేటర్ సునీల్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నియామకానికి కృషి చేసిన కాంగ్రెస్ నేతలకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు



నారాయణరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న బొద్దు సునీల్

గన్నేరువరం: లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొద్దు సునీల్ జిల్లా స్థాయిలో బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డును క్లబ్ ఫాస్ట్ గవర్నర్ రిక్కల నారాయణరెడ్డి చేతుల మీదుగా సోమవారం కరీంనగర్‌లో అందుకున్నారు. బెస్ట్ డిస్టిక్ కోఆర్డినేటర్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ అవార్డు గంప వెంకన్న, బెస్ట్ లియో రీజియన్ కోఆర్డినేటర్ అవార్డు బూర శ్రీనివాస్, జిల్లా బెస్ట్ సెక్రటరీ అవార్డు తెల్ల భాస్కర్, జిల్లా బెస్ట్ ట్రెజరర్ అవార్డు కాంతాల అంజిరెడ్డి అందుకున్నారు. అలాగే బెస్ట్ పర్మమెంట్, బెస్ట్ నీడెడ్ సర్వీస్ అవార్డు, బెస్ట్ క్యాలెండర్ అవార్డులను గన్నేరువరం లయన్స్ క్లబ్ దక్కించుకుంది. అనేక కార్యక్రమాలతో జిల్లా స్థాయిలో క్లబ్‌ను ప్రథమ స్థానంలో నిలపడం హర్షనీయమని, అందరి సహకారంతో సాధ్యమైందని ప్రెసిడెంట్ సునీల్ తెలిపారు.

హుండీ బహూకరణ



హుండీ బహూకరించిన శ్రీనివాసరావు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయానికి సోమవారం ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు దేశ్‌ముఖ్ –పద్మజ దంపతులు హుండీని బహూకరించారు. గ్రామానికి చెందిన ఉమ్మెత్తల సుగుణాకర్‌రెడ్డి హోమం కోసం పదికిలోల నెయ్యి అందించారు. ఈకార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవేణుగోపాలస్వామి కల్యాణం



జమ్మికుంట: పట్టణంలోని భగవద్గీత జ్ఞాన మందిర్ వార్షికోత్సవం సందర్భంగా రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం సోమవారం ప్రధాన అర్చకులు మరింగంటి సంతోష్‌కు మరాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, లక్ష పుష్పార్చనలు చేశారు. కార్యక్రమంలో శ్రీ భగవద్గీత జ్ఞాన మందిర్ సేవా సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శివాజీ ఆశయాలను కొనసాగిద్దాం



హుజూరాబాద్: బోర్నపల్లిలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



గంగాధర: వేడుకల్లో మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, తదితరులు

హుజూరాబాద్: ఛత్రపతి శివాజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని హుజూరాబాద్‌ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని 18వ వార్డు బోర్నపల్లిలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ రాధిక శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు , ఆరె కుల సంఘం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

గంగాధర: శివాజీ చరిత్రను యువకులు పాఠాలుగా నేర్చుకోవాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని గట్టుభూత్కూర్‌లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి శివాజీ జయంతిలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, జీవీఆర్,మండల అధ్యక్షుడు నవీన్‌రావు, వైస్ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చొప్పదండి: శివాజీ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని పుర వీధుల గుండా వీహెచ్‌పీ నాయకులు శోభాయాత్ర నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ గుర్రం నీరజ జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు క్రిష్ణ, సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణ శివారులోని శివాజీ విగ్రహం వద్ద ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు కాట్మండి మహేందర్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రామారావు, రాష్ట్ర నాయకులు, వివిధ గ్రామాల ఆరె సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలకేంద్రంలో ఆరె సంక్షేమసంఘం మండల అధ్యక్షుడు ఇరువాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి నిర్వహించారు. ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావు, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రభాకర్, యువజన సంఘం అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని లింగాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో శివాజీ జయంతి నిర్వహించారు. యువత శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని పార్టీ మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ అన్నారు.



చొప్పదండి: శోభాయాత్రను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ



జమ్మికుంట: నినాదాలు చేస్తున్న ఆరె సంక్షేమ సంఘం నాయకులు

మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలని వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉదయ్, రాము, వెంకటేశ్, ప్రవీణ్

గన్నేరువరం: గన్నేరువరం నుంచి కరీంనగర్ వరకు మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ ఆధ్వర్యంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సోమవారం కరీంనగర్‌లో వినతిపత్రం అందజేశారు. మండలానికి కరీంనగర్‌కు కేవలం 9 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండేదని, మానేరు డ్యాం నిర్మాణం చేపట్టిన తరువాత 45 కిలోమీటర్ల దూరభారం పెరిగిందని, అంతేకాకుండా అభివృద్ధిలో మండలం వెనుకబడిపోయిందన్నారు. యువత, విద్యార్థులు, ప్రజలకు విద్య, వైద్యం భారమవ్వడమే కాకుండా ఉపాధి, ఉద్యోగాలకు దూరమయ్యారని, బ్రిడ్జి నిర్మిస్తే మండలంతో పాటు సిద్దిపేట, రాజన్నసిరిసిల్లా జిల్లాలకు చెందిన బెజ్జంకి, ఇల్లంతకుంట మండల ప్రజలు కరీంనగర్ రాకపోకలు సాగించడానికి అనువుగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం త్వరగా సర్వే చేపట్టి నిర్మాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పుల్లెల రాము, సహాయ కార్యదర్శులు గుండా వెంకటేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఏసీపీ



రంగనాయకుల గుట్ట వద్ద జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్: పట్టణ శివారులోని రంగనాయకుల గుట్ట, మండలంలోని జూపాకలో సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లను సోమవారం హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్‌జీ పరిశీలించారు. రంగనాయకుల గుట్ట వద్ద సమ్మక్క సారలమ్మ గద్దెలను దర్శించుకొని పూజలు చేశారు. ఎండోమెంట్ అధికారులు, సమ్మక్క జాతర చైర్మన్ మూగల రాజిరెడ్డితో ఏర్పాట్లపై పోలీసుశాఖ తీసుకునే చర్యలు చర్చించారు. సమ్మక్క జాతర రూట్ మ్యాప్‌ను ఆవిష్కరించారు. వెంట హుజూరాబాద్ టౌన్ సీఐ బొల్లం రమేశ్, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఈ. చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ అధికారులు సుధాకర్, మారుతిరావు, జాతర వైస్ చైర్మన్ సురుకంటి, తిరుపతి రెడ్డి, రాజు, ఉమాశంకర్, మున్సిపల్ సిబ్బంది ప్రతాపరాజు, రమేశ్ తదితరులు ఉన్నారు.

శంకరపట్నం: మండలంలో నిర్వహించబోయే సమ్మక్క –సారలమ్మ జాతరకు భక్తులకు ఇబ్బంది కలుగకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తామని ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. సోమవారం గద్దెల వద్ద మొక్కులు చెల్లించారు. అనంతరం మాట్లాడుతూ పాలకవర్గానికి, పోలీసు సిబ్బందికి తగు సూచనలు చేశారు. వాహనాలకు పార్కింగ్, భక్తులకు ఏర్పాటు చేసిన క్యూలైన్లను పరిశీలించారు. జాతర ప్రాంగణాన్ని సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తామన్నారు. ఈకార్యక్రమంలో జాతర కమిటీ చైర్మన్ స్వామి, సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై లక్ష్మారెడ్డి, పాల్గొన్నారు.

నూతన కార్యవర్గానికి సన్మానం



మత్స్యకార్మిక సహకార సంఘం సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి: చొప్పదండి మత్స్యకార్మిక సహకార సంఘం నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడిగా పిట్టల వెంకటేశ్‌తో పాటు డైరెక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుర్రం భూమారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ముద్దం మహేశ్, నూనె చందు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు చేస్తున్న పోలీసులు

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద టౌన్ సీఐ వరగంటి రవి ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం రాత్రి వాహనాల తనిఖీ, డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురిపై కేసులు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో ఎస్ఐ రాజేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.